క్లుప్తంగా

జగనన్న విద్యా దీవెనపై సమీక్ష

మైదుకూరు: పట్టణంలో శుక్రవారం జగనన్న విద్యాదీవెన, ఉపకార వేతనాలపై సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సరస్వతమ్మ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మైదుకూరు, చాపాడు, కలసపాడు, పోరుమామిళ్ల, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాలకు చెందిన సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సహాయకులు, ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు, వసతి గృహ సంక్షేమ అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న జగనన్న విద్యాదీవెన, ఉపకార వేతనాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆమె సూచించారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



విద్యార్థులకు పలకలు అందజేస్తున్న సూర్యనారాయణరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని మురుకూటి సూర్యనారాయణరెడ్డి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక రామేశరం పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు శుక్రవారం పలకలను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు విజయ చంద్రహస్‌రెడ్డి, నరసింహులు, రామలక్షుమ్మ, విజయలక్ష్మి, నందిని, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



ఎంఈఓను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

దువ్వూరు : మండల విద్యాశాఖాధికారి – 2గా బాధ్యతలు స్వీకరించిన సగిలి భాస్కర్‌ను శుక్రవారం ఎస్టీయూ నాయకులు పుల్లారెడ్డిపేట ఎమ్మార్సీ భవనంలో కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు ఆయనకు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు.

వెల్లాల పార్వతీదేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మల్లె, జాజి, కనకాంబరం పూలు, 101 నిమ్మకాయలు వేసి అమ్మవారిని అర్చకుడు వెంకటాచలపతి శోభాయమానంగా అలంకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు రాజువారిపేటలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండల పరిధిలోని రాజువారిపేటలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరం నిర్వహించి రోగులకు, దీర్ఘకాళిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఉచిత సేవలు

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో శనివారం నుంచి ఉచిత సేవలు అందించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల వివరాలు, మ్యుటేషన్, రేషన్ కార్డు దరఖాస్తు, ఆధార్ కార్డు నమోదు ఇంకా వివిధ రకాలైన ప్రభుత్వం సేవలు నెల రోజులపాటు ఉచితంగా అందిస్తామన్నారు. ఇదే క్రమంలో గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అందని వారున్నా, ఎలాంటి సమస్యలు ఉన్న గ్రామ సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలియజేశారు.

కనకదుర్గమ్మకు పూజలు

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలో గల కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత సేవలు అందించడమే

జగనన్న సురక్ష లక్ష్యం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రజలకు అవసరమైన సేవలను ఉచితంగా వేగంగా అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీలోని ఒకటో వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఇంటికే పరిపాలన తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని తెలిపారు. ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని సీఎం జగన్ నిరూపించారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వారికి అవసరమైన పలు రకాలైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో రాజకీయ పార్టీలు ఓట్ల కోసమే ప్రజల వద్దకు వెళ్లేవని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ప్రజల మనసులను గెలుచుకునేందుకు వారి ముంగిటకే పరిపాలన కొనసాగిస్తుందన్నారు. జూన్ 23 నుంచి జూలై 24 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి వలంటీర్, గృహసారథి పరిధిలో ఉన్న 50 లేక 60 కుటుంబాలను కలుసుకుని వారికి అవసరమైన ధ్రువపత్రాల వివరాలను తీసుకుని సచివాలయంలో అందించాలన్నారు. వీటికి సంబంధించిన ధ్రువపత్రాలను ఒక వారంలోగా మంజూరు చేసే ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగేళ్లుగా పరిష్కారం కాని సమస్యలను పేదరికమే ప్రామాణికంగా అర్హతగల ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా పరిష్కరిస్తామన్నారు. ఒకటో వార్డులో 1162 కుటుంబాలు ఉండగా అందులో 93 శాతం అంటే 1070 కుటుంబాలకు ఏదో ఒక రూపంలో ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ ఒక్క వార్డుకే సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ఖాతాల్లో జమ చేసిన మొత్తం రూ.14,72,13,000 లుగా ఉందన్నారు. సచివాలయ ఎంఎల్‌ఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ప్రజలను ఎలా కలుసుకోవాలో వారికి వివరించారు. మరణ, జనన, ఆదాయ, మ్యూటేషన్ లావాదేవీలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు సెల్‌నంబర్ అనుసంధానం, పంట సాగు హక్కుకార్డు లాంటి సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిత్యం ప్రజల్లో ఉండే విధంగా కార్యక్రమాలు రూపకల్పన చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకెళ్లి వారి సమస్యలను పరిష్కరిస్తూ వారికి అవసరమైన సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, వార్డు కౌన్సిలర్ పందిటి సరోజ, బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గోపవరం : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం గోపవరం సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులతో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ హరినారాయణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలసపాడు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. జూలై 1 నుండి 24వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

పోరుమామిళ్ల : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు. జూలై 1వ తేదీన ఎంపీడీఓ, తహసీల్దారు ఆధ్వర్యంలో రంగసముద్రం–1 సచివాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు తమకు కావాల్సిన సర్టిఫికెట్లను పొందవచ్చన్నారు.

కాశినాయన : అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి కూడా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఎంపీడీఓ మైథిలి అన్నారు. శుక్రవారం ఇటుగుల్లపాడు గ్రామ సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు వీక్షించారు. ఆమె మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుండి రేషన్‌కార్డులు, కుల, ఆదాయ, జనన, మరణ ధృవీకరణ పత్రాలను సచివాలయాల్లో ఫీజు చెల్లించకుండానే మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బరాయుడుకు సన్మానం



సుబ్బరాయుడును సన్మానిస్తున్న ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : మండలంలోని పెన్నానగర్ సీపీఐ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పి.సుబ్బరాయుడును ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నాయకులు శాలువా, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రొద్దుటూరు ఏరియా ప్రధాన కార్యదర్శి పూసల చిన్న ఓబన్న మాట్లాడుతూ సుబ్బరాయుడు రెండో సారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఇంకా ఎన్నో ఉన్నత పదవులు ఆయన పొందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షుడు ఓబులేసు, సహాయ కార్యదర్శి కె.సుబ్బరాయుడు, కార్మిక నాయకులు సత్యరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

పోరుమామిళ్ల : ప్రజల సమస్యలను పరిష్కరిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అక్కలరెడ్డిపల్లె గ్రామంలో ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తమకు సహాయ సహకారాలు అందించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సి.బాషా, చెన్ను రాజశేఖర్, సర్పంచ్‌లు బాలగురివిరెడ్డి, రమణారెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె గ్రామంలో రూ.70 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజి కాలువ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, సర్పంచ్ ఈశ్వరమ్మ మునివర శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో ఇప్పటికే సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువలను కొన్ని ప్రాంతాల్లో నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సహకారంతో ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, ఎంపీటీసీ మేరి అశోక్, పునరుద్రారెడ్డి, చిన్నరెడ్డి, పాతకోట బలరామిరెడ్డి, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో మలేరియా దూరం

అట్లూరు : దోమలను నిర్మూలిస్తే మలేరియా దరిచేరదని స్థానిక వైద్యాధికారి హమీదాబేగం తెలిపారు. మండల పరిధిలోని స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మలేరియా, డెంగూ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు తదిత వ్యాధులన్నీ దోమకాటు వలన మాత్రమే వ్యాపి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. దోమలను నిర్మూలిస్తే తదితర వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీకృష్ణా, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ సుబ్బరాయుడు వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదిరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం



ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎస్పీలు



కార్యక్రమానికి హాజరైన మహిళా సంరక్షణ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల భద్రతకు సంబంధించిన చట్టాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. స్థానిక అర్బన్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సబ్ డివిజన్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను శుక్రవారం వారు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కుటుంబ కలహాలతో బంధాలు విడిపోకూడదన్న ఉద్దేశ్యంతో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, వలంటీర్లు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. భార్యాభర్తల గొడవల కారణంగా పిల్లల మానసిక ఎదుగుదలపై దుష్ప్రభావం చూపుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడైనా కుటుంబ సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌కు తీసుకువచ్చేలా చూడాలని మహిళా సంరక్షణ కార్యదర్శులకు, వలంటీర్లకు సూచించారు.

తొలిరోజే నెరవేరిన లక్ష్యం

పట్టణానికి చెందిన ఓ మహిళా వైద్యురాలు, ఓ వైద్యుడి మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా కొన్ని సంవత్సరాలుగా వేరువేరుగా ఉంటున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉంటున్న మహిళా వైద్యురాలు తమకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆన్‌లైన్‌లో జిల్లా ఎస్పీకి దరఖాస్తు చేసుకోగా వెంటనే స్పందించిన ఆయన శుక్రవారం వారిరువురిని బద్వేలు ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌కు పిలిపించి వారికి తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చి వారిని మళ్లీ ఏకం చేశారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్, సీఐలు వెంకటేశ్వర్లు, హనుమంతనాయక్, నరేంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, అడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్‌లెస్లై కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయికృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్‌చార్జీల పేరుతో బిల్లుల మోత



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య

ప్రొద్దుటూరు : విద్యుత్ సర్‌చార్జీల పేరుతో బిల్లుల మోత మోయిస్తున్నారని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో విద్యుత్ బిల్లుల పెంపుపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ నూతన చట్ట సవరణ పేరుతో 2015 నుంచి 2025 వరకు సర్‌చార్జీల పెంపు, ఇంధన చార్జీలను ప్రజలపై మోపేందుకు చట్టం తెచ్చిందన్నారు. ఈ చట్టానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎంపీలచే మద్దతు తెలిపి రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల పెంపు మోత మోయిస్తున్నదన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ నూతన టారీఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపుతున్నారన్నారు. టీడీపీ నాయకుడు ముక్తియార్ మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలకు డిస్కంలను అప్పజెప్పి ఆయా కంపెనీలకు ప్రజల దోచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నజీర్ మాట్లడుతూ ప్రజలకు రాయితీలు ఇవ్వకుండా విద్యుత్ చార్జీలను పెంచడం అన్యాయమన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ దక్షిణాదిలో ఏ రాష్ట్రం ఈ విధానాన్ని అంగీకరించలేదని, మన రాష్ట్ర ప్రభుత్వమే అంగీకరించిందన్నారు. స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇలియాస్, నరసింహాచారి మాట్లాడుతూ కొత్త స్లాబ్‌ల మూలంగా వ్యాపార వాణిజ్య సంస్థల మనుగడ సాగించలేకున్నాయన్నారు. రాయలసీమ పరిరక్షణ సంఘం నాయకుడు ప్రతాప్‌రెడ్డి, కుతుబుద్దీన్, ఏఐటీయూసీ నాయకులు యేసోబ్, హరి, మధు, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, ఐఎన్‌టీయూసీ ఇన్‌చార్జి ఎల్లయ్య, చిన్న వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు వీరయ్య శెట్టి, ఆప్ నాయకుడు ఫిజా దస్తగిర్, ఎంపీజే నాయకుడు సలీం, దళిత సంఘం నాయకుడు ఎల్లయ్య మాదిగ, చేనేత సంఘం నాయకుడు శివారెడ్డి, ప్రతాప్, మహిళా సమాఖ్య నాయకురాళ్లు ప్రమీల, సుజాత, మైనారిటీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌ను త్వరలోనే వాడుకలోకి తెస్తాం

బద్వేలు అర్బన్ : స్థానిక విద్యానగర్‌లో సుమారు 13 ఏళ్ల క్రితం రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన అంబేడ్కర్ భవన్‌కు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి త్వరలోనే వాడుకలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌కు ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల నుండి మంజూరైన రూ.15 లక్షల నిధులతో అంబేడ్కర్ భవన్ చుట్టూ నిర్మించనున్న ప్రహరీగోడకు శుక్రవారం వారు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, సివిల్ సప్‌లెస్లై కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల శాతం పెంచేందుకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

బద్వేలు అర్బన్ : బాలికల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది కృషి చేయాలని ఆర్డీఓ ఆకులవెంకటరమణ సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ లెవల్ మల్టీమెంబర్స్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికల సంఖ్య పెంచాలంటే తొలుత లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం (పీసీపీఎన్‌డీటీ) పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని కోరారు. అలాగే గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి బాల్యవివాహాలపై, లింగ నిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ రామలక్ష్మి, రేడియాలజిస్టు డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, ఆశా కార్యకర్తలు, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కాశినాయన : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సావిశెట్టిపల్లె, ఇటుగుల్లపాడు, అమగంపల్లె గ్రామాల్లో రూ.1.50 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్లు, సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిశెట్టిపల్లెలో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్లు, ఇటుగుల్లపాడులో రూ.13 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. ఇటుగుల్లపాడు నుండి పాశం వారిపల్లెకు రూ.1.30 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం చేపడుతుందన్నారు. అనంతరం అమగంపల్లె సర్పంచ్ సౌమ్యదీప్తి బాలమ్మ వృద్ధాశ్రమంలో రూ.10 లక్షలతో నిర్మించిన వృద్ధులకు వసతిగృహాన్ని ప్రారంభించారు. వృద్ధుల కోసం సొంత నిధులతో భవనాన్ని నిర్మించడం హర్షించదగ్గ విషయమన్నారు. బాలమ్మ సత్రం నిర్వాహకులు పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి, ఎంపీడీఓ మైథిలి, పీఆర్ ఈఈ నాగరాజు, డీఈ అమర్‌నాథ్, ఏఈ పుల్లయ్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి




ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ

ప్రొద్దుటూరు క్రైం : వర్షాకాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. మలేరియా మాసోత్సవం సందర్భంగా బొల్లవరంలో శుక్రవారం దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటిలోని పాత్రలను కడిగి ఆరబెట్టిన తర్వాత తిరిగి నీరు నింపుకోవాలని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలన్నారు. జ్వరం వస్తే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. వైద్యాధికారి సునీల్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సీఓ సుబ్బారెడ్డి, ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం అందించాం.. అభివృద్ధి చేస్తున్నాం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 8వ వార్డులో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం వార్డులోని ఐదో సచివాలయం వద్ద విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్నా చాలా మంది కొన్ని సర్టిఫికెట్లు లేక పథకాలను అందుకోలేకున్నారని పేర్కొన్నారు. అందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయం పరిధిలో క్యాంపులు నిర్వహించి 11 రకాల సర్టిఫికెట్లను ప్రజలకు ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు.

రూ.16 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

మున్సిపాలిటీలోని 5వ సచివాలయం పరిధిలో రూ.16 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు నిర్వహించినట్లు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. అమ్మ ఒడి, జగనన్న వసతి, విద్యాదీవెన, చేయూత, ఆసరా, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాల ద్వారా రూ.10కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైపులైనుల వంటి అభివృద్ధి పనులకు రూ.6.73 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇందులో 350 మందికి రూ.6.30 కోట్లతో పక్కా ఇళ్లు కట్టిస్తున్నట్టు తెలిపారు.

అబద్ధాలు చెప్పడమే చంద్రబాబు నైజం

అబద్ధాలు చెప్పడమే చంద్రబాబు నైజమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మండిపడ్డారు. 2014 ఎన్నికలకు ముందు రుణమాఫీ అంటూ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాడన్నారు. మోసం చేయడంతో ప్రజలు 2019 ఎన్నికలో ఇంటికి సాగనంపారని ఎద్దేవా చేశారు. సర్పంచ్‌గా కూడా గెలవలేని లోకేష్ వైఎస్సార్‌ను, జగన్‌ను విమర్శించడం అవివేకమన్నారు. సీమ వాసినని చెప్పుకుంటున్న లోకేష్ దమ్ముంటే చిత్తూరు జిల్లాలో పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చిన సీఎం దేశంలో వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. మైదుకూరులో పక్కా టీడీపీ అభిమానులకు సంక్షేమ పథకాలు ఇచ్చామంటే ఆ ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. ప్రజల్లో ఉండి సమస్యలను పరిష్కరించాల్సిందిగా సీఎం చెప్పారని, తాము అదే చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వైస్ చైర్మన్లు మూలె రేణుక, షరీఫ్, వార్డు ఇన్‌చార్జి మూలె భరత్‌కుమార్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, కూశెట్టి రాయుడు, భూమిరెడ్డి సుబ్బరాయుడు, కిరణ్మయి, మార్కెట్ రవి, బీఎల్ రఘురామయ్య, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, వీరభద్రుడు, పిల్లి నాగయ్య, సన్నా శ్రీనురావు, కొండా భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, హౌసింగ్ డీఈఈ పాండురంగారెడ్డి, ఏఈలు నిరంజన్‌రెడ్డి, రామభద్రయ్య, ఎంఈఓ పద్మలత పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

మైదుకూరు మున్సిపాలిటీలో ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందనే విషయంపై టీడీపీ చర్చకు సిద్ధపడాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సవాల్ విసిరారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన శుక్రవారం మైదుకూరు మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో మున్సిపాలిటీలో అంతా అవినీతేనని, తాము సాక్ష్యాలతో సహా నిరూపిస్తామన్నారు. ఈ రెండేళ్లలో తమ హయాంలో ఏమేమి అభివృద్ధి చేశామో చర్చకు వస్తే చూపిస్తామని తెలిపారు. వారం రోజుల్లో వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో పలు పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ రంగస్వామి, హౌసింగ్ డీఈఈ పాండురంగారెడ్డి, ఏఈ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగభవ్యశ్రీకి అభినందనలు



నాగభవ్యశ్రీని సత్కరిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక సాయిరాజేశ్వరి కాలనీకి చెందిన ఉపాధ్యాయులు నాగేంద్ర, ఇంద్రజల కుమార్తె నాగభవ్యశ్రీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో జాతీయ స్థాయిలో మహిళా విభాగంలో మొదటి ర్యాంకు, ఓవరాల్‌గా 56వ ర్యాంకు సాధించింది. శుక్రవారం నాగభవ్యశ్రీకి ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవ్యశ్రీ ప్రొద్దుటూరు సత్తాను దేశంలో చాటిందని, భవిష్యత్తులో తనకు ఇష్టమైన సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించి ఈ ఊరి ప్రజలకు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు రామచంద్ర, సాయికుమార్, నాగేశ్వరరావు, సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.